అద్దె జాగలో అవస్థలు

మాల్ సంతకు సొంత స్థలం కరువు

- ప్రైవేటు స్థలంలోనే అంగడి నిర్వహణ
- లక్షల్లో ఆదాయం.. కనీస వసతులు కరువు
- ఇబ్బందుల్లో వ్యాపారులు, రైతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మాల్‌లో ప్రైవేటు వెంచర్‌లో నిర్వహిస్తున్న పశువుల సంత

మండలంలోని మాల్ మార్కెట్‌లో ప్రతి మంగళవారం పెద్దఎత్తున సంత జరుగుతుంది. నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై.. రంగారెడ్డి, నల్గొండ జిల్లాల సరిహద్దులో ఉండటంతో అది అంచెలంచెలుగా వాణిజ్య కేంద్రంగా ఎదిగింది. ప్రతి వారం లక్షల్లో వ్యాపారం కొనసాగుతున్నది. అయినప్పటికీ సంత నిర్వహించేందుకు అక్కడ సొంత స్థలం లేకపోవడం గమనార్హం. నేటికీ పశువుల సంతను ఓ ప్రైవేటు వెంచర్ స్థలంలో నిర్వహిస్తున్నారు. అది ప్రైవేటు స్థలం కావడం, అక్కడ కనీస వసతులు సైతం లేకపోవడంతో పశువుల క్రయ, విక్రయదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలం ద్వారా పంచాయతీకీ లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ కనీస వసతులు కల్పించకపోవడం పట్ల వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంగడిలో నెలకొన్న సమస్యలపై అటు పాలకులు.. ఇటు పంచాయతీరాజ్ అధికారులు చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. - యాచారం, సెప్టెంబర్ 29

రోడ్డు పక్కనే విక్రయాలు జరుపుతున్న చిరు వ్యాపారులు

రోడ్డు పక్కనే క్రయవిక్రయాలు

మాల్ పశువుల సంతకు ప్రసిద్ధి. ప్రతి మంగళవారం రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన వివిధ మండలాల వ్యాపారులు, రైతులు అంగట్లో పశువుల క్రయవిక్రయాలు కొనసాగిస్తారు. కాడెద్దులు, గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, పొట్టేళ్ల విక్రయాలు జోరుగా కొనసాగుతాయి. అంగడికి సొంత స్థలం లేకపోవడంతో పశువుల సంతను ప్రైవేటు వెంచర్‌లో, చిరువ్యాపారులు నాగార్జునసాగర్ రోడ్డుకు ఇరువైపులా వివిధ రకాల వస్తువులను అమ్ముకొని జీవనోపాధి పొందుతున్నారు. దీంతో రోడ్డు రద్దీగా మారుతున్నది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. అప్పుడప్పుడు రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాల్‌లో అంగడికి ప్రత్యేక స్థలం కేటాయించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తప్పని తాగునీటి వెతలు

ఉదయం నుంచి సాయంత్రం వరకు పశువులు, వ్యాపారులతో సంత నిర్వహించే స్థలం కిటకిటలాడుతుంది. మూగజీవాలకు సరిపడా తాగునీరు లేక అవి అల్లాడుతుంటాయి. ఒకటి, రెండు తొట్లు నిర్మించినప్పటికీ అందులో సరిపడా నీరుండటంలేదు. మూగజీవాలతోపాటు వ్యాపారులు, వినియోగదారులకు సైతం నిర్వాహకులు తాగునీరు సౌకర్యం కల్పించకపోవడం గమనార్హం. దీంతో వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసి నీరు తాగాల్సిన దుస్థితి నెలకొన్నది. వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని, తొట్లలో పుష్కలంగా నీటిని అందుబాటులో ఉంచాలని వ్యాపారులు, రైతులు కోరుతున్నారు.

మౌలిక వసతులు కరువు

సంతలో ఎలాంటి షెడ్లను ఏర్పాటు చేయకపోవడంతో మండుటెండలో మూగజీవాలు విలవిల్లాడుతుంటాయి. వ్యాపారులు, రైతులు పశువులను అమ్మాలన్నా, కొనాలన్నా ఎండలో నిలబడి ఇబ్బందులెదుర్కొంటున్నారు. వానకాలంలో వర్షంలో తడుస్తూ వ్యాపారం కొనసాగిస్తుంటారు. అక్కడక్కడ టెంట్లు వేసినప్పటికీ అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో నిలువనీడ కరువవుతున్నది. కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా లేవు. సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

శాశ్వత స్థలం కేటాయించాలి

పశువుల సంతకు శాశ్వత స్థలాన్ని కేటాయించాలి. వేల సంఖ్యలో పశువుల క్రయ, విక్రయాలు జరగడం.. వందల సంఖ్యలో వ్యాపారులు రావడంతో ప్రైవేటు స్థలంలో ఇబ్బందులు తప్పడంలేదు. మాల్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సంతకు కేటాయించి సమస్యను పరిష్కరించాలి. సంతలో వ్యాపారులు, మూగజీవాలకు మౌలిక వసతులను కల్పించాలి. సంతను మరింత అభివృద్ధి దిశగా నడిపించాలి. దీని కోసం అధికారులు ప్రత్యేక చొరవ చూపి చిరువ్యాపారులకు స్థలాన్ని కేటాయించాలి.

- కలకొండ అంజయ్య, వ్యాపారి, మేడిపల్లి

అధికారులు స్పందించాలి

సంతకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు సంబంధిత రెవెన్యూ, పంచాయతీ అధికారులు కృషి చేయాలి. సంతలో కనీస వసతులు కల్పించకపోతే నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు స్థలంలో సంతను నిర్వహించడం వలన వ్యాపారులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలం, వర్షాకాలంలో అవస్థలు పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. సంతలో అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయాలి.

- దేరంగుల రాజు, నల్లవెల్లి మాజీ సర్పంచ్


పసిడి కాంతులు

ప్రకృతిలో ప్రతీది అద్భుతమే.. కనువిందైన దృశ్యమే.. కోటి కాంతులు వెదజల్లే సూరీడు ఉదయిస్తూనే జగత్తును మేల్కొలుపుతాడు. తెల్లవారుజామన తూర్పు దిక్కున ప్రభవించే భానుడు ప్రపంచంపై పసిడి కాంతులు విరజిమ్ముతాడు. ఆ సమయంలో ఎరుపు, బంగారు వర్ణంతో కనిపించే ఆకాశం మనల్ని మరో లోకంలోకి తీసుకెళ్తుంది. పశ్చిమాన వాలిపోయే సమయంలోనూ ఈ సుందర దృశ్యం మారోమారు సాక్షాత్కరించింది ఇబ్రహీంపట్నం మండలం బొంగులూరులో ఆదివారం సూర్యుడు ఉదయించు వేళ ఆకాశం పసిడికాంతులతో ముచ్చటగొలిపింది. నిత్యం నీలిరంగులో కనిపించే వినీలాకాశం పొద్దుపొద్దున బంగారు వర్ణంతో కనిపించడాన్ని చూసిన వారంతా తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

- ఇబ్రహీంపట్నంరూరల్, సెప్టెంబర్ 29

మధ్యలోనే నిలిచిపోయిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

నిధులు లేక.. పనులు జరగక..

- అర్ధాంతరంగా నిలిచిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు
- బీఆర్ఎస్ హయాంలో రూ.2 కోట్లు మంజూరు
- వాటితోనే పిల్లర్లు, బేస్‌మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుల స్లాబ్ తదితర పనులు పూర్తి
- మిగిలిన పనుల పూర్తికి రూ.కోటీ70 లక్షలు అవసరం
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించిన అధికారులు
- నిధుల విడుదల ఎప్పుడో.. పూర్తయ్యేది ఎన్నడో..?

సమీకృత మార్కెట్ బేస్‌మెంట్‌కు వచ్చిన పగుళ్లు

పరిగి, సెప్టెంబర్ 29 : అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలైన పట్టణాల్లో కూరగాయలు, మాంసం, కోడి, చేపలు తదితర వాటిని ఒకే దగ్గర విక్రయించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. పరిగి పట్టణంలో చేపట్టిన పనులు నిధుల్లేక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. భవనాన్ని గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో 48 షాపులు వచ్చేలా ఇంజినీర్లు డిజైన్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.రెండు కోట్లు విడుదల చేయగా.. ఆ మొత్తంలో జీఎస్‌టీ, ఇతర ఖర్చులు పోనూ సుమారు రూ.కోటిన్నరతో పనులు జరగాల్సి ఉండగా రూ.కోటీ30లక్షలతో పిల్లర్లు, బేస్‌మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుల స్లాబ్ తదితర పనులు జరిగినట్లు సమాచారం. నిధుల లేమితో మిగిలిన పనులు నిలిచిపోయాయని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రధాన రహదారిపై కూరగాయల విక్రయాలు

అదనపు నిధులకు ప్రతిపాదనలు

సమీకృత మార్కెట్ నిర్మాణానికి అదనంగా సుమారు రూ.కోటీ70లక్షల వరకు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి అదనపు నిధులను మంజూరు చేయాల్సిందిగా ప్రభుత్వానికి పంపించినట్లు సమాచారం. సమీకృత మార్కెట్ నిర్మాణంలో భాగంగా 48 షాపులకు గోడలు, షట్టర్లు, కరెంటు, ఫ్లోరింగ్, వరండాలో టైల్స్ తదితర పనులను చేపట్టాల్సి ఉన్నది. ప్రభుత్వ అధికారులు స్పందించి పనులు త్వరగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా వుండగా బేస్‌మెంట్ వద్ద పగుళ్లు వచ్చాయని.. అధికారులు నాణ్యతతో జరిగేలా పర్యవేక్షించాలని సూచిస్తున్నారు.

నడి రోడ్డుపైనే విక్రయాలు

సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో కూరగాయలు, పండ్లు, చేపలు తదితర వాటిని వ్యాపారులు ఎండలో కూర్చునే విక్రయిస్తున్నారు. పరిగి పట్టణంలో శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు కూరగాయల విక్రయాలు జరుగుతుంటాయి. శుక్రవారం ప్రస్తుతం సమీకృత మార్కెట్ నిర్మాణం జరుగుతున్న దగ్గర, ప్రధాన రహదారిపై, గంజ్‌రోడ్డులో, శనివారం ప్రధాన రహదారితోపాటు మార్కెట్ యార్డులో కూరగాయలను విక్రయిస్తుంటారు. ఎండకు, వానకు ఇబ్బందులు పడుతూ కూరగాయలను విక్రయించాల్సి వస్తున్నదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా సమీకృత మార్కెట్ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

దివ్యాంగులు బస్‌పాస్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

యాచారం, సెప్టెంబర్ 29 : దివ్యాంగులు డిస్టిక్ బస్‌పాస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు డేరంగుల ఈశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొనారు. మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గల దివ్యాంగుల కమ్యూనిటీ భవనంలో దివ్యాంగుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం దరఖాస్తు చేసుకున్నవారికి ఆర్టీసీ అధికారులు డిస్టిక్ పాస్‌ను అందించనున్నట్లు తెలిపారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఓయూ, సెప్టెంబర్ 29 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షలను వచ్చే నెల 8 నుంచి, ఎంబీఏ (ఈ వినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్) (ఈవినింగ్) రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 17 నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని ఆయన సూచించారు.

గాంధీ తత్వం నేటి తరానికి తెలిసేలా పాదయాత్ర

- అక్టోబర్ 2నుంచి జనవరి 12వరకు 100 రోజులు వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర

వంద రోజులు వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి తదితరులు

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 29: సమాజ శ్రేయస్సు కోరుతూ గాంధీతత్వాన్ని నేటి తరానికి తెలియజేయాలనే ఆశయంతో శివార్చక విజయకుమార్ చేపట్టిన పాదయాత్రకు ప్రభుత్వ యంత్రాంగం సహకరించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. గాంధేయవాది, విద్యావేత్త డాక్టర్ శివార్చక విజయకుమార్ గాంధీ జయంతిని పురస్కరించుకుని గాంధీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే లక్ష్యంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అక్టోబర్ 2నుంచి జనవరి 12వరకు చేపట్టిన వందరోజుల్లో వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర పోస్టర్‌ను రమణాచారి తన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కేవీ రమణాచారి మాట్లాడుతూ.. అలంపూర్ జోగులాంబ దేవాలయం నుంచి అక్టోబర్ 2న ప్రారంభిస్తున్న పాదయాత్ర అచ్చంపేట ఉమామహేశ్వర దేవాలయం వరకు సాగి జనవరి 12న ముగుస్తుందన్నారు. గాంధీజీ బాటలో నడుస్తున్న అరవై ఏండ్ల ప్రాయంలో విజయకుమార్ చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సమాజం విపత్కర పోకడలతో జీవనం సాగిస్తున్న తరుణంలో గాంధేయవాదం ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ప్రయత్నం ఎంతో గొప్పదని ప్రముఖ రచయిత, కవి గంటా మనోహర్‌రెడ్డి ప్రశంసించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు పి.బడేసాబ్, డాక్టర్ విజయకుమార్, ప్రభాకర్‌రెడ్డి, అబ్దుల్‌రజాక్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

పెరుగుతున్న జీర్ణశయాంతర, కాలేయ వ్యాధులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ) : దక్షిణ భారతంలో జీర్ణశయాంతర, కాలేయ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సులో పలువురు గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. హైటెక్ సిటీలో ఆదివారం నిర్వహించిన జీఐ డిజార్డర్స్ అత్యవసర పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జీర్ణశయాంతర రుగ్మతలు, కాలేయ వ్యాధులు అంటువ్యాధి వలే వేగంగా వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ప్రతి ఐదుగురు పెద్దల్లో ఒకరు వీటి బారిన పడ్డారన్నారు. 500కు పైగా గ్యాస్ట్రోఎంటరాలజీ(జీఐ) వైద్య నిపుణులతో నిర్వహించిన సదస్సులో జీర్ణశయాంతర రుగ్మతలు, కాలేజీ సంబంధిత వ్యాధులతో ఏటా 2.68లక్షలకు చేరుకున్నాయని తెలిపారు.

యశోద గ్రూప్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవర్ గోరుకంటి మాట్లాడుతూ... జీఐ, కాలేయ వ్యాధిగ్రస్తుల అవసరాలకు అనుగుణంగా ఆధునాతన వైద్య సాంకేతిక పరిజ్ఞానం యశోద హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. తీవ్రమైన జీర్ణశయాంతర రక్తస్రావం, ప్రేగు అడ్డంకులు, తీవ్రమైన కాలేయ వైఫల్యం, ప్యాంక్రియాటైటిస్, ఫ్యాటీ లివర్, వైరల్ హెపటైటిస్, సిర్రోసిస్, లివర్ ఫెయిల్యూర్ వంటి అనారోగ్య సమస్యలకు విభిన్న వైద్య విధానాలు, చికిత్స ప్రణాళికలు, వ్యాధి నివారణ, ముందస్తుగానే గుర్తించడం, స్క్రీనింగ్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో యశోద వైద్యుల బృందం డా.నవీన్ పోలవరపు, డాక్టర్ సంతోష్ ఎనుగంటి, కేఎస్ సోమశేఖర్ రావు, డాక్టర్ గోపీ శ్రీకాంత్, డాక్టర్ శరత్ చంద్ర గోరంట్ల తదితరులు పాల్గొన్నారు.

దామగుండం విధ్వంసానికి కుట్ర

-కేబీఆర్ పార్క్ వద్ద పర్యావరణ ప్రేమికుల ఆందోళన

సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా దామగుండం అడవి పరిరక్షణ కోసం తెలంగాణ ఉద్యమకారులు మల్లేపల్లి నర్సింహులు ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. దామగుండంలో 2900 ఎకరాల భూమిని నేవీ రాడర్ స్టేషన్ కోసం అడవిని నాశనం చేయడం మంచిది కాదని నర్సింహులు అన్నారు. రాడార్ స్టేషన్ ఏర్పాటుతో అడవి విధ్వంసమవుతుందని, పర్యావరణం పాడవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అడవిలో 500 ఏండ్ల చరిత్ర గల రామలింగేశ్వర స్వామి గుడి విధ్వంసానికి గురవుతుందని వివరించారు. డెబ్బై వేల మంది ప్రజలు అక్కడ అడవిపైనే ఆధారపడి ఉన్నారని, వాళ్లంతా ఆగమవుతారని తెలిపారు. అడవి విధ్వంసంతో రాబోయే రోజుల్లో అందరూ ఆక్సిజన్ సిలిండర్లు పెట్టుకునే దుస్థితి వస్తుందన్నారు. అడవి విధ్వంసానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. సుమారు 12 లక్షల చెట్లు, నరికివేతకు గురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్నింగ్‌వాకర్స్, అనిత, శివకుమార్, భగవాన్, స్వామి, అశోక్ ఉన్నారు.

నోవోటెల్‌లో ఉత్సాహంగా కేక్ మిక్సింగ్ వేడుక

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 29 : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నోవోటెల్ హోటల్‌లో క్రిస్మస్ పండుగకు ముందస్తుగా ఆదివారం కేక్ మిక్సింగ్ వేడుకలు ఉత్సహభరిత వాతావరణంలో నిర్వహించారు. అతిథులతో పాటు హోటల్ సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నోవోటెల్ జనరల్ మేనేజర్ సుఖ్ బీర్‌సింగ్ మాట్లాడుతూ.. కేక్ మిక్సింగ్ వేడుక ప్రత్యేక సంప్రదాయమన్నారు. గత 13 ఏండ్లుగా ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ద్రాక్ష పండ్లతో పాటు విస్కీ కలిపి తయారు చేసే ఈ కేక్‌ను క్రిస్మస్ సందర్భంగా విక్రయిస్తామన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉన్న నోవాటెల్‌కు రోజురోజుకు అతిథులు పెరుగుతున్నారని వివరించారు. వేడుకలలో పలువురు యువతీయువకులు, చిన్నారులు, హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కేక్ మిక్సింగ్ చేస్తున్న నోవోటెల్ హోటల్ సిబ్బంది

ద్రాక్ష పండ్లను తొక్కుతున్న చిన్నారులు

మాల్ బస్టాండ్‌ను ఉపయోగంలోకి తేవాలి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన మండల మాజీ ప్రజాప్రతినిధులు

యాచారం, సెప్టెంబర్ 29 : మండలంలోని మాల్ మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను ఉపయోగంలోనికి తీసుకురావాలని మాల్, నల్లవెల్లి, కిషన్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం ఎమ్మెల్యే రంగారెడ్డికి విన్నవించారు. మాల్‌లో ఎన్నో ఏండ్ల క్రితం నిర్మించిన బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో నిరుపయోగంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. బస్టాండ్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారని వాపోయారు. బస్తాండ్‌ను ఉపయోగంలోకి తీసుకొచ్చి బస్సులు ఆగేలా చర్యలు చేపట్టాలని కోరారు. బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న దుకాణ సముదాయాల షెట్టర్లు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఉపయోగంలోకి తీసుకొచ్చేలా చూడాలని కోరారు. దీంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పేదలకు అండగా ఉండే పార్టీ.. బీఆర్ఎస్

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అప్పారెడ్డి ముఖేశ్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు అత్తాపూర్‌కు రాక

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 29 : పేదలకు అండగా ఉండే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అప్పారెడ్డి ముఖేశ్ అన్నారు. ఆదివారం సాయం త్రం అత్తాపూర్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చేందుకు కుట్రలు చేస్తుందన్నారు. దీనిని తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితాఇంద్రారెడ్డి, మహమూద్ ఆలీ, గంగుల కమలాకర్, మల్లారెడ్డి తదితరు బండ్లగూడ బాధితులను పరామర్శించినట్లు పేర్కొన్నారు. బాధితుల సమస్యలను తెలుసుకోని వారి పక్షాన పోరాడతామని స్పష్టం చేశారన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం సాయంత్రం 5.30 గంటలకు అత్తాపూర్ మూసీ పరీవాహక ప్రాంతానికి రానున్నట్లు తెలిపారు. భరత్‌నగర్, అత్తాపూర్, అంబియన్స్‌ఫోర్ట్ తదితర ప్రాంతాల బాధితులతో సమావేశమై మాట్లా డతారని అన్నారు. అలాగే అంబియన్స్‌ఫోర్ట్ వద్ద భారీ సభ నిర్వహించనున్నారని, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు,కార్యకర్తలతో పాటు బాధితులు హాజరుకావాలని కోరారు. ఆయన వెంట గుర్రంపల్లి యాదగిరి, లక్ష్మణ్, నరేందర్ తదితరులున్నారు.